క్లుప్తంగా

దుర్గమ్మ ఆలయంలో చోరీ



గొడుగు ఎత్తుకెళ్లడంతో బోసిపోయిన అమ్మవారి విగ్రహం

బత్తలపల్లి: రాఘవంపల్లిలోని దుర్గమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆదివారం తెల్లవారుజామున ఆలయంలో పూజా కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఆలయ అర్చకులు వెంకటరెడ్డి వెళ్లగా చోరీ జరిగినట్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఏడాది క్రితం నూతనంగా ఆలయం నిర్మించి అందులో దుర్గమ్మ తల్లిని ప్రతిష్ఠించారు. అమ్మవారికి నూతనంగా 15 తులాలతో వెండి గొడుగు చేయించారు. ఇప్పటి వరకు ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని సైతం తెరవలేదు. గొడుగు, హుండీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యాధికారికి ప్రశంసలు



డీఎంహెచ్‌ఓ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న వైద్యాధికారి జ్యోత్స్న

పుట్టపర్తి అర్బన్: మండలంలో ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ, రోగులకు అందిస్తున్న సేవలకు పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రశంసలు అందాయి. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా పుట్టపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యోత్స్నకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు. వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఎయిడ్స్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారని, పరీక్ష ఫలితాలను గోప్యంగా ఉంచరాదని, అనుమానం ఉన్నవారు పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్ఎన్ లలిత కుమారి, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


భగవద్గీత కంఠస్థ, పఠన పోటీలు



ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: స్థానిక షిర్డీసాయి బాబా ఆలయంలో ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల కంఠస్థ, పఠన పోటీలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు జిల్లా ఇన్‌చార్జ్‌లుగా ధర్మాచార్యులు, శేషాద్రి, రామ్మోహన్ వ్యవహరించారు. పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సివి.రమణ, సుందర్‌మోహన్‌రెడ్డి, నాగప్ప విజేతలకు ఎంపిక చేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్కృత పండితులు శర్మ, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ అనంతపురం జిల్లా ఇంచార్జ్ బాబు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'హైందవ శంఖారావం' జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

తలుపుల : ఈ నెల 5న విజయవాడలో తలపెట్టిన హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ కదిరి శాఖ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో శంఖారావం పోస్టర్లను విడుదల చేశారు. హిందూ ధర్మ పరిరక్షణకు అందరూ తోడ్పడాలని కోరారు. ఆర్ఎస్ఎస్ సభ్యులు కోటా నాగరాజు, ఏకల్ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, హైందవ శంఖారావం కదిరి కన్వీనర్ డాక్టర్ శివప్రకాష్, మండల సేవక్ సంఘ్ సభ్యులు శ్రీరాములు, బాలఉగ్రం, గంగరాజు, ఎద్దుల రాముడు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని కోరారు.



క్రీడా మైదానంలో ఆడుకుంటున్న విద్యార్థులు

పడితే... పరుగులు తీయాల్సిందే!

- పాఠశాలల్లో ప్రథమ చికిత్స కిట్ల కొరత
- విద్యార్థులు గాయపడితే ఆస్పత్రికి వెళ్లాల్సిందే
- కిట్ల సరఫరాపై స్పందించని ప్రభుత్వం

ధర్మవరం అర్బన్: విద్యార్థులు ఆటలాడే సమయంలో గాయపడితే వారికి ప్రథమ చికిత్స చేసేందుకు పాఠశాలల్లో కిట్లు అందుబాటులో లేవు. ప్రమాదాల బారిన పడినవారు ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మాత్రం ప్రథమ చికిత్స కిట్ల కొనుగోలుకు నిధులను మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో మొత్తం 265 ఉన్నాయి. వాటిలో మొత్తం దాదాపు 14 వేలమందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఏడాదికి రూ.5 వేలు, పాఠశాల నిర్వహణ కింద రూ.7వేలు నిధులు విడుదలవుతాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు రూ.7–12 వేల నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. విద్యుత్ బిల్లుల చెల్లింపు, స్టేషనరీ కొనుగోలు ఆ నిధులను వెచ్చించేందుకు అనుమతి ఉంది. మరో వైపు అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులకు ప్రథమ చికిత్స చేయడానికి ఆ నిధులనే వెచ్చించే వెసులుబాటు కూడా ఉంది. అయితే పాఠశాల నిర్వహణ, స్టేషనరీ కొనుగోలుకే ఆ నిధులు సరిపోవడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ప్రథమ చికిత్స కిట్లు ఏవీ?

ప్రథమ చికిత్స పెట్టె తప్పనిసరి చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు లేకపోవడం, ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో పాఠశాలల్లో మందుల కొరత వేధిస్తోంది. ఒకరిద్దరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధతో పీహెచ్‌సీల నుంచి టించరు, దూది, బ్యాండేజీలు, క్లాత్‌లు తీసుకొచ్చి పాఠశాలల్లో ఉంచుతున్నారు. మిగిలిన పాఠశాలల్లో ఎలాంటి మందులు లేవు. అప్పుడప్పుడు ఆరోగ్య కార్యకర్తలు పాఠశాలలను సందర్శించి విద్యార్థులను పరీక్షిస్తుంటారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతంలో సర్వశిక్షా అభియాన్ ద్వారా పాఠశాలలకు మెడికల్ కిట్లు సరఫరా చేసేవారు. అనంతరం మరిచిపోయారు. ప్రభుత్వం స్పందించి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలోని పాఠశాలల వివరాలు..

మండలం	ఉన్నత పాఠశాలలు	యూపీ పాఠశాలలు	ప్రైమరీ పాఠశాలలు
ధర్మవరం మున్సిపాలిటీ	7	3	28
ధర్మవరం రూరల్	4	14	35
బత్తలపల్లి	5	5	39
తాడిమర్రి	5	7	43
ముదిగుబ్బ	7	4	59
మొత్తం	28	33	204

మెడికల్ కిట్లకు ప్రత్యేక నిధులు లేవు



ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలలకు ప్రత్యేకంగా మెడికల్ కిట్ల కొనుగోలుకు నిధులు ఉండవు. పాఠశాలలకు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో గాయపడిన విద్యార్థులకు వైద్యం చేయించాలి. అప్పుడప్పుడు పాఠశాలలకు వైద్యసిబ్బంది వచ్చి చిన్నపాటి మందులు ఇస్తుంటారు.

– గోపాల్‌నాయక్, ఎంఈఓ, ధర్మవరం

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా అధ్యక్షుడు భాస్కరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఆదివారం సంఘం కదిరి శాఖ అధ్యక్షుడు ఫక్రోద్దీన్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తాలూకా కార్యవర్గ సభ్యులు ఉద్యోగుల సమస్యలను తమ దృష్టికి తేవాలన్నారు. వాటిని ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కదిరి శాఖ గౌరవాధ్యక్షుడు అత్మారెడ్డి, ప్రెసిడెంట్ డాక్టర్ నాగేంద్రనాయక్, సంయుక్త కార్యదర్శులు గోపినాయక్, రామచంద్రారెడ్డి, దేవాలాల్‌నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయసం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిని ప్రభుత్వ ఉగ్యోగులు ఘనంగా సన్మానించారు.

రామకృష్ణారెడ్డి సేవలు మరువలేం



రామకృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించిన రామకృష్ణారెడ్డి సేవలు మరువలేనివని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి గుండెపోటుతో మృతి చెందడంతో ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. రామకృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి రామకృష్ణారెడ్డి పార్టీలో కొనసాగారన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. గతంలో డీలర్‌గా ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. అనంతరం భార్య సువర్ణమ్మ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తిలో ఫిబ్రవరిలో 6,7,8,9, తేదీల్లో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)22వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉగ్యోగాలు, ఉపాధి లేక జిల్లాల నుంచి వలసలు పోతున్నారన్నారు. వలస పోయిన చోట కూడా చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పాలక వర్గం విధానాలతో నిరుద్యోగుల సమస్య పెరిగిపోతోందన్నారు. కొంత మంది యువత పెడదారిన పడుతూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి కల్పన, గంజాయి నియంత్రణలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. రాష్ట్ర మహాసభలకు నిరుద్యోగులు, యువత భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. నాయకులు, గోపి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు లయన్స్‌క్లబ్ చేయూత



డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్యను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా లయన్స్‌క్లబ్ నిరుపేదలకు చేయూతనిస్తోందని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు అధ్యక్షతన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ పేదలకు ఉచితంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించి కంటిచూపు మందగించిన వారికి శస్త్రచికిత్సలు చేయించి చూపును అందిస్తున్నామని తెలిపారు. క్యాంపు దాతగా మెటికల చెన్నమ్మ, మెటికల చెన్నప్ప జ్ఞాపకార్థం వారి కుమారుడు మెటికల కుళ్లాయప్ప వ్యవహరించారు. అనంతరం పీడీ ఈశ్వరయ్య, ఫిజికల్ డైరెక్టర్ సునిత, దాతలను శాలువాలతో సన్మానించారు. లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఆకులేటి రమేష్‌బాబు, కోశాధికారి ఉలవల నాగేంద్ర, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గూడూరు మోహన్‌దాస్, గోసే రాధాకృష్ణ, గూడూరు రాజగోపాల్, పల్లెం వేణుగోపాల్, మెటికల కుళ్లాయప్ప, పుట్లూరు నరసింహులు, శాగా సురేష్, వెంకటేష్‌కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

పరిహారం కోసం నిరీక్షణ



జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బుచ్చయ్యగారిపల్లి వద్ద కోల్పోనున్న ఇళ్లు

పుట్టపర్తి: జాతీయరహదారి –342 నిర్మాణం కోసం భూములు, ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ముదిగుబ్బ – బుక్కపట్నం మీదుగా పుట్టపర్తి, గోరంట్ల, కోడూరు తోపు వరకు 80 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయి. ఇందులో మొదటి విడతలో ముదిగుబ్బ– బుక్కపట్నం వరకు 32 కిలోమీటర్ల మేర పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. ఈ రహదారి కోసం ప్రభుత్వ భూమి కాక బుచ్చయ్యగారిపల్లి, చంద్రాయునిపల్లి, గరుగుతండా, కసబతండా గ్రామాల్లోని రైతులు, ప్రజల నుంచి వంద ఎకరాల వరకు ప్రభుత్వం భూమి సేకరించింది. సాంకేతిక కారణాలతో దాదాపు 50 మందికి రూ.1.50 కోట్ల మేర పరిహారం అందలేదు. దీంతో బాధితులు తమకు న్యాయం చేయాలంటూ బుక్కపట్నం కార్యాలయం, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. తమకు పరిహారం డబ్బు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా కవితోత్సవం



చిన్నారులకు జ్ఞాపికలు అందిస్తున్న అతిథులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పోలా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జిల్లా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కవితోత్సవం ఉత్సాహంగా జరిగింది. నాగులాదేవి అనే శ్రీకృష్ణదేవరాయల ప్రేమకథ చారిత్రక నవలను ఆవిష్కరించారు. నాడు రాయలు మహిళల పట్ల చూపిన ఆదరణ, ప్రజల పట్ల చూపిన సేవాభావం సాహిత్యానికి చేసిన కృషిని నవలలో కొనియాడారు. రచయితలు ఆంధ్రప్రభ ఎడిటర్ శర్మ, జీఎస్టీ కమిషనర్ విద్యాధరరావు, కళారత్న డిక్కీ కృష్ణ, పురావస్తు శాఖ ఏడీ రజిత, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు నరేంద్రరెడ్డి, రచయితల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జయసింహ, ప్రధాన కార్యదర్శి సత్య నిర్ధారణ్ తదితరులు హాజరై కవితలపై చర్చించారు. అనంతరం శ్రీ లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువు బాబు బాలాజీ, రామలాలిత్య ఆధ్వర్యంలో శిష్యులు నాట్య ప్రదర్శన చేశారు. చేనేతల కష్టాలు, వృద్ధాప్యపు విలువలను బాబు బాలాజీ, రామలాలిత్యలు పాటలు రాసి ఆలపించి అలరించారు. నిర్వాహకులు వారికి జ్ఞాపికలు అందించారు.

రోడ్డు నియమాలు పాటించకుంటే చర్యలు



జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ ప్రభాకర్

బత్తలపల్లి: రోడ్డు నియమాలు పాటించకుంటే చర్యలు తప్పవని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ వాహనదారులను హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం బత్తలపల్లి బైపాస్‌లో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. వాహన రికార్డులు ఎల్లప్పుడు దగ్గర ఉంచుకోవాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి రాంపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు ప్రతి రోజు ఎక్కడో ఒక చోట సైబర్ నేరగాళ్ల చేతిలో ప్రజలు మోసపోతున్నారన్నారు. ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అల్లర్లకు ఉసిగొలిపితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రామగిరి సీఐ శ్రీధర్

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో ప్రజలను రెచ్చగొట్టి అల్లర్లకు ఉసిగొలిపితే కఠినంగా శిక్షించడం జరుగుతుందని రామగిరి సీఐ శ్రీధర్ రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లోని రౌడీషీటర్లకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామాలు ప్రశాంతంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలను అనవసరంగా రెచ్చగొట్టినా, దౌర్జన్యాలకు దిగినా ఉపేక్షించేది లేదన్నారు. వారు ఎంతంటి వారైనా సరే వదిలేదని హెచ్చరించారు. ప్రశాంతంగా జీవనం సాగించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా, కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు



తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలో వెలసిన పుణ్యక్షేత్రం కాటికోటేశ్వర క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి స్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, వివిధ రకాల పూలమాలలతో అందంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఇక్కడ భక్తులు ముందుగా గదా గుండం (కోనేరు)లో పుణ్యస్నానాలు చేసి ఆలయ ప్రదక్షిణలు చేశారు.

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం



ధర్మవరంలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, ఆశా కార్యకర్తలు, మైత్రి సంఘం సభ్యులు



కదిరిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ నారాయణరెడ్డి



ఓడీచెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ధర్మవరం అర్బన్: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ హాజరై ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి కాలేజి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. వైద్యులు పుష్పలత, సురేష్‌నాయక్, కిరణ్‌కుమార్, శక్తి మైత్రి మహిళా సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణమ్మ, మేనేజర్ నవీన్‌కుమార్ రాయల్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ బాషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేశారు.

గాండ్లపెంట: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యాధికారులు మహేశ్వరమారుతి, బాబాఫక్రుద్దీన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ వైఎస్సార్ కూడలి వరకూ సాగింది. ఈ సందర్భంగా వైద్యాధికారులు వ్యాధి సోకడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మానవహారంగా ఏర్పడి వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. హెచ్ఈ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్లు ఉపేంద్రారెడ్డి, పార్వతమ్మ, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి టౌన్: ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కదిరి ఏరియా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది తలపెట్టిన ర్యాలీని పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. టవర్‌క్లాక్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. హెచ్ఐవీ ఉందని భయపడొద్దని, ఆస్పత్రిలోని ఏఆర్‌టిలో మందులు దొరుకుతాయని వక్తలు పేర్కొన్నారు. అనంతరం ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎయిడ్స్ బాధితులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకుని ఆరోగ్యంగా జీవించడం ఒక్కటే మానవ మనుగడకు మార్గమని వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాశ్ పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వద్ద ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం డాక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రాజేంద్ర ఎయిడ్స్‌కు కారణాలు, నివారణ చర్యలు చేపట్టారు. ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటనారాయణ, టెక్నీషియన్ బషీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చక్రవర్తి థియేటర్ ఎదురుగా ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఆలయంలో కాలభైరవస్వామిని ప్రత్యేకంగా అలంకరించి గుమ్మడికాయల దీపాలు వెలిగించి పూజలు చేశారు.అనంతరం అన్నదానం చేపట్టడంతోపాటు కంకణాలు కట్టామని పూజారి ధనుంజయ ఆచారి తెలిపారు.